[మీవూరెంత గొప్పది? మీవూరి ప్రాశస్త్యం గురించి మా పత్రిక ద్వారా ఆంధ్రలోకానికి తెలియజేయండి. మీ వూరిమీద మీరెంత అభిమానం చూపినా, మా కభ్యంతరంలేదు. —సంపాదకుడు.]

మా మదనపల్లి

కె. సుబ్బరామప్ప

"మా మదనపల్లి" అంటే మదనపల్లివాళ్లు ఉడాయిస్తారేమో. నేను పన్నెండేండ్లకు పైగా ఉండబట్టి, 'డామిసైల్' అని గట్టిగా చెప్పకుంటాను. మదనపల్లి అంటే ఇండియాలోనే కాదు పాశ్చాత్యదేశాల్లో కూడా పేరుమోసింది. దీనికి రెండుకారణాలు. ఇక్కడ థియాసఫిస్టు లుండటమూ, ఈవూరికి నాలుగు మైళ్లలోనే శానిటోరియం (క్షయరోగనివారణా కేంద్రం) ఉండటమూ. ఇదీగాక మదనపల్లి అనాదిగా విద్యాప్రచారానికీ, జాతీయసంరంభానికీ ప్రసిద్ధి చెందింది. రవీంద్రనాథటాగూరుగారు ఇక్కడ కొన్నాళ్లుండినారు. ఆయన పేరుతో "టాగూరుకాటేజి" అని ఇప్పటికీ ఆయన ఉండిన కుటీరం కళాశాల కాంపౌండులో ఉంది. ఆనిబిసెంటుగారి హోమ్‌రూల్ ఉద్యమంకూడా యిక్కడనే మరింత ప్రచారానికి వచ్చింది.

మదనపల్లికళాశాల చాలామంది విద్యార్థినీ విద్యార్థుల్ని ఏటేటా ఆకర్షిస్తూ ఉంది. ముఖ్యంగా ఈకాలేజీలో "శా"సిస్టమ్ ఉందనీ, విద్యార్థులకు స్వేచ్ఛ ఉంటుందనీ, సెలెక్షన్లలో పొత్తువిద్యకు డిటెన్షన్లు ఉండవనీ, పొత్తువిద్య (Coeducation) కు యిక్కడ మంచి ప్రాశస్త్యం ఉందనీ ప్రతీతి. విద్యార్థుల ఉద్యమాల్లో కూడా మదనపల్లివిద్యార్థులు ముందంజ వేస్తూ ఉంటారు. ఈ కళాశాలకోసరం ఆనిబిసెంటు జార్జి అరండేలు, డాక్టరుకజిన్స్, ఎర్నెస్టువుడ్, ఆర్. గిరిరావు, సి. యస్. త్రిలోకీకరూ మొదలైన మహామహులు కష్టించినారు. ఒకప్పుడు దీనికి రికగ్నిషన్ పోగా నేషనల్ యూనివర్సిటీ అయింది. ఆనేషనల్ డిగ్రీహోల్డర్సులో గొప్పగొప్పవాళ్లు యిప్పుడు ఉన్నారు. మార్చి నెలలో దీనికి రజతోత్సవంకూడా జరుగుతుంది. మదనపల్లికళాశాలప్రత్యేకత యేమంటే, కళా నైపుణ్యానికీ, సర్వమతసమ్మేళనానికీ ముందంజ వేసింది.

మదనపల్లికి తొమ్మిదిమైళ్ల దూరంలో ఒక గురుకులాశ్రమం (Boarding School) పద్ధతిని ఋషివ్యాలిహైస్కూల్ అని ఒకటి ఉంది. పరిపూర్ణంగా గురుకులాశ్రమపద్ధతినే నడపబడుతూ ఉంది. ఇక్కడ బాలికాబాలకులకు మానసిక పరిస్థితులనుబట్టి విద్య చెప్పుతారు. చిన్నపిల్లల్ని కూడా తర్ఫీదుచేస్తారు. ఇక్కడికి కూడా ఇండియాలో అన్నిప్రదేశాలనుంచీ బాలికాబాలకులు వస్తారు. ఇక్కడ మామూలు అన్నిపాఠశాలల్లో మాదిరిగా గాక వారి వారి బుద్ధికుశలతల్ను బట్టి శిక్షణయిస్తారు.

మదనపల్లి శానిటోరియం అంటే అందరికీ బాగా తెలుసు. వైస్రాయిభార్యకూడా ఇటీవల దీన్ని చూడడానికి వచ్చింది. గవర్నరు భార్య మొన్న మొన్ననే వచ్చి వెళ్లింది. ఇండియాలోనే కాక, దేశాలనుంచీకూడా రోగులు ఇక్కడికి ట్రీట్‌మెంటుకు వస్తారు. మొత్తానికి ఇది బీదవాళ్లకు అందుబాటులో లేనిది అని ప్రతీతి. ఇక్కడంతా మిషనరీలే అధికారస్థులు. మెడికల్ గ్రాడ్యుయేట్లకు క్షయరోగనివారణలో శిక్షణ యిస్తారు. దీనికి మొన్ననే రజతోత్సవం జరిగింది.

మదనపల్లి ఆంధ్రోద్యమంలో వెనుకబడలేదు. అయినా అరవలసంఖ్య మాత్రం విపరీతంగానే ఉంది. ముఖ్యంగా పి. డబ్ల్యు. డి. ఆఫీసంతా వీళ్లదే అయిపోయింది. అక్కడ ఉండే ఒకరిద్దరు తెలుగు గుమాస్తాలూ అరవమే మాట్లాడుతారు. అరవలు అన్నిటికీ బాగా పోటీ తగులుతూ ఉంటారు. ఉద్యోగస్థుల్లో వీళ్లదే సంఖ్య యెక్కువ. అరవలవే కాఫీహోటళ్లూనూ.

స్వాతంత్ర్యసమరములో మదనపల్లివాళ్లు వెనకపడ్డారు. ఇప్పటికి సత్యాగ్రహం చేసి యిక్కణ్ణుంచీ జైళ్లకుపోయి ఉండేవాళ్లే దీనికి నిదర్శనం. ఖద్దరు ఉత్పత్తి చేయడం, నూలువడకడం, ఖద్దరు ధరించడం యిప్పు డిప్పుడు ప్రబలుతూ ఉంది. ఖద్దరంటే విద్యార్థుల్లో ఒక మోజు యేర్పడింది. నూలువడకడం "హాబీ" అయింది.

ఇక్కడ నాటక సినిమా కళలలో అనుభవశాలులూ, ఉత్సాహంవంతులూ; డబ్బులేకా, ప్రోత్సాహం లేకా నిరుత్సాహవంతులైనవారూ ఉన్నారు. మొట్ట మొదట ఆంధ్రదేశంలో నాటకాలు విరివిగా లేని రోజుల్లో శ్రీ ఆర్. శేషగిరిరావుగారు ఒక నాటకంపెని లేవదీసి దాంతో ఆంధ్రదేశంలోని ముఖ్యనగరాలన్నీ తిరిగివచ్చి మదనపల్లి నాటకకళను చాటినారు. కొన్ని సెలలక్రిందట నాటకంపెనీలు కొన్ని బయలుదేరి అంతర్ధానమొందినాయి. నిరుద్యోగుల్లో నాటకాల సినిమాలపిచ్చి బలే ఉంది. అయితే అందరికీ ఆశాభంగం అయింది. సినిమా డైరెక్టర్లమనీ ప్రొడ్యూసర్లమనీ అనిపించుకోవాలనే ఉత్సాహవంతులు చాలామంది ఉన్నారు మావూళ్లో.

మదనపల్లి ఆరోగ్యస్థలం అని చాలాప్రతీతి. ఎండాకాలంలో ఎక్కడెక్కడి వాళ్లూ యిక్కడికి వస్తారు. ఇక్కడికి నాలుగైదు మైళ్లదూరంలో ఉండే హార్సీకొండలు నందికొండలంత ప్రసిద్ధిని యించుమించుగా సంపాదించినాయి. కొండమీద బంగళా లున్నాయి. సౌకర్యాలున్నాయి. బసినికొండ, మాదినికొండ, మల్లయకొండ మొదలైన కొండలున్నాయిఊరుచుట్టూ. ఇక్కడి నుంచీ అయిదారు మైళ్ల తరువాత మైసూరు రాష్ట్రం ఆరంభమౌతుంది. రైల్వేస్టేషన్ మాత్రం సమీపంలో లేదు.

"దూరపుకొండలు నునుపు, దగ్గఱి కొస్తే రాళ్లూ రప్పలూ" అన్నట్లు దూరదేశంవాళ్లు మదనపల్లి ఆరోగ్యాన్ని పొగుడుకుంటారు. తీరావచ్చినతర్వాత వాళ్లకూ కొంత ఆశాభంగం కలిగితీరుతుంది. ఊరిబైట పరిసరాలు బాగుంటాయి. ఊళ్లో శానిటేషనూ అదీ బాగాలేదు. క్రిక్కిరిసినయిండ్లూ గాలీ, లైటులేనివీ చాలా కనిపిస్తాయి. దోమలూ, నల్లులూ చాలినన్ని ప్రతియింటిలోనూ ఉంటాయి. ఇక్కడ కొళాయిలూ, ఎలెక్ట్రిక్ దీపాలూలేని కొరత ఎక్కువగా ఉంది. పంచాయతీబోర్డువాళ్లు శ్రద్ధవహిస్తే పట్టణాన్ని అందంగా చేయవచ్చు. స్వలాభాలకు పాటుపడడమూ, కక్షలు సాధించడమూ కొనసాగితే ఊరు పాడైపోతుంది.

రాజకీయ రంగంలో మదనపల్లి వెనుకబడలేదని అనిపించుకుంది. నాయకత్వానికి యువకులూ, పెద్దలూ అంతా ఉవ్విళ్లూరుతూ ఉంటారు. ఏవైనా సభలు జరిగితే కాన్వాస్ చేసుకొని అధ్యక్షపీఠాన్ని అలంకరిస్తారు. ఇటీవల మాత్రం పెద్దలకు పెద్దిరికం తక్కువైంది.

ఛోటానాయకులూ, నాయకమ్మన్యులూ (కొందరు) బయలుదేరారు. అన్నిటికీ మేమే అంటారు. దేశంలో ఉండే సంఘాలన్నీ చిన్నవిగానో, పెద్దవిగానో యిక్కడా ఉన్నాయి. ముస్లిమ్‌లీగువాళ్లుకూడా ఘాటుగా ప్రచారం చేస్తూ జిన్నాకు బ్రహ్మరథం పట్టుతూఉంటారు. పైలర్, క్లబ్బులూ, సోడాఫ్యాక్టరీక్లబ్బులూ, కాఫీహోటలుక్లబ్బులూ కొన్ని ఉన్నాయి. ఇక్కడంతా నిరుద్యోగులూ, యితరులూ చేరి బాతాఖానీలు వేస్తూ రాజకీయాలు, నాటకవిషయాలు మొదలైనవి తర్కించుకుంటూ, రాజులను క్రిందికి నూకుతూ రాష్ట్రాలను తలక్రిందులు చేస్తూ ఉంటారు.

పత్రికారచనలో ఇక్కడ యెక్కువ ఉత్సాహం ఉంది. విలేఖర్లకు పత్రికారచయితలకు కలిసి యిక్కడ ఒక సంఘం ఉంది. విలేఖర్లు అన్యోన్యంగా ఉంటారు. రాయలసీమ యొక్క తాలూకా సెంటర్లన్నింటిలోకీ యిక్కడే పత్రికలు ఎక్కువగా అమ్ముడుపోతూ ఉంటాయి. పత్రికాపఠనానికి పల్లెటూరివాళ్లనీ కూడా యీ వూరు పురికొల్పింది.

మొత్తానికి మదనపల్లికి అదొక విధమైన గొప్పతనం ఉంది. అందరూ యీ వూరిని చూడాలని కోరుతారు. అయితే, ఆ గొప్పతనాన్ని యితరులే గుర్తించి గ్రహించుకోవాలిగాని యిక్కడుండేవాళ్లు మాత్రం తెలుసుకోలేరు. మదనపల్లివాండ్లంటే మునుపు రాడీలు అని ప్రతీతి. ఇప్పు డదంతా పోయింది. మదనపల్లికి గొప్పతనమూ, గౌరవమూ, ప్రసిద్ధీ తెచ్చింది హైస్కూలు కళాశాలలే అని చెప్పవచ్చు.

భక్తాగ్రేసరుడు

[ఒక అభూతకల్పన]

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

యవ్వనమంతా విషయవాంఛల్లో గడిపిన భోగి నడివయస్సులో తన దృష్టి భగవంతుడిమీదికి మళ్లించి భక్తు డైనాడు.

భక్ష్యభోజ్యపానీయాలూ, స్త్రీలూ ఆనందంలో కొత్త అనుభవం ఇచ్చే ఆశ తీరిపోగానే భోగి భక్తుడుగా పరిణమించాడు.

ఐహికసుఖాలు తన నింకా ఏమాత్రమో ఆకర్షిస్తూ ఉండటం గ్రహించి భక్తుడు వాటిని తీవ్రంగా నిరసించసాగాడు.

భక్తిలో అతనికి నిజమైన ఆనందం కనిపించక కాదు, కనిపించింది - అపారంగా కనిపించింది.

నువ్వుల్లోనించి వచ్చేనూనెకు అంతున్నది, ఇనుకలో నించి వచ్చే తైలానికి అంతే లేదు. కవిగా దన్నట్టు వినపడే సంగీతం మధురంగా ఉంటుంది; వినిపించని సంగీతం మధురతరంగా ఉంటుంది.

బయటినించి లోపలికి పొయ్యే ఆనందానికి మేర ఉంటుంది; లోపలినించి బయటికొచ్చే ఆనందానికి మేరలేదు.

రైతులు నేద్యం చేస్తున్నారు, రాళ్లవాళ్లు రాళ్లు పగలగొట్టుతున్నారు, సాలెవాళ్లు బట్టలు నేస్తున్నారు, పాకీవాళ్లు రోడ్లు చిమ్ముతున్నారు, ఆడవాళ్లు పిల్లల్ని కంటున్నారు. భోగిమాత్రం భక్తు డైనాడు.

ఇతరప్రపంచం తుచ్ఛజీవితంలో, శ్లేష్మంలో, ఈగలాగా, పడికొట్టుకుంటుంటే భక్తుడు ఆత్మసంతృప్తి చెందగలిగాడు.

కాని భక్తుడికి భక్తివల్లకలిగే ఆనందం చాలలేదు. మొదట ఏకైకత్వంగా కనిపించినది రానురాను ఏకాకిత్వంగా కనిపించసాగింది.

అందుకని భక్తుడు భక్తిప్రచారం ప్రారంభించాడు.

"ఈతుచ్ఛసుఖాల్లో పడి ఎంతకాలం కొట్టుకుంటారు? వీటిని విసర్జించండి! తారకమైన హరిపదసేవ చెయ్యండి! ఈ సుఖాలు హరినామకీర్తనకు సాటిరావు! ఇవి మిమ్మల్ని ఉద్ధరించలేవు!" అని ప్రచారం చెయ్యసాగాడు భక్తుడు.

భక్తుడి భక్తిపారవశ్యం అందరినీ ఆకర్షించింది. అందరినీ నమ్మించింది.

విషయలంపటులైనవారంతా భక్తుణ్ణి మాసి ఒకనిట్టూర్పు విడిచారు. "ఆహా! ఎంతధన్యుడు! ఇంద్రియవాంఛలను ఎట్లా జయించాడు? మనబోటి మానవమాత్రులకు ఆ విరక్తి సాధ్యం కాదు కద! ఆయనతో పోలిస్తే మనం ఎంత పశుతుల్యులం!" అనుకున్నారు వారు. ఈ ఆత్మవిమర్శతో పవిత్రాత్ములైనవారై, తమ ఆత్మలను తిరిగి మకిలపరుచుకోవటంకోసం విషయవాంఛలవంక తిరిగారు—నీళ్లలో పరిశుభ్రమై వచ్చిన కుక్క ఆనందంగా రోడ్డుమీద పొర్లినట్టు

"ఈతుచ్ఛసుఖాల్లో పడి ఎంతకాలం కొట్టుకుంటారు? వీటిని విసర్జించండి! తారకమైన హరి

(19-వ పేజీ చూడుడు)







ఈ సైకిల్‌ఫీట్సు చేసినవారు బరంపురం వాస్తవ్యులు వీరిపేరు మాధవదాస్ గోపాలరావు. కులంతెలగ, వయస్సు 26. తాతా కంపెని (జంషడ్‌పూర్) లో పనిచేయుచున్నారు. జంషడ్‌పూర్ ఆంధ్రా అథిలెటిక్‌క్లబ్ సమక్షంలో యీ ఫీట్సు వీరు చేయగా తీసినా ఛాయాపటములు. 15 అడుగుల ఎత్తు స్టాండుమీద యీ అద్భుత సైకిల్‌ఫీట్సు చేసినవారిలో వీరు ద్వితీయులు అని తెలియుచున్నది. (ఆం. ప. విలేఖరి).

భక్తాగ్రేసరుడు

[6-వ పేజీ తరువాయి]

పదసేవ చెయ్యండి! ఈ సుఖాలు హరినామ కీర్తనకు సాటిరావు! ఇవి మిమ్మల్ని ఉద్ధరించ లేవు!" అని ఉద్బోధించటం మానలేదుభక్తుడు.

ఈమాటలు విని విద్యాధికులూ, సంస్కారులూ రసగ్రహణంచేసి వెళ్లిపోయినారు. కాని విద్యాహీనులకు భక్తుడిమాటల్లో ఒకపిలుపూ, ఒక ఉద్బోధమూ, ఒక ఆజ్ఞా వినిపించినై.

రైతు నాగలి వదిలిపెట్టాడు, రాళ్లవాడు సుత్తె అవతల పారేశాడు, సాలెవాడు మగ్గం ముందునుంచి లేచాడు, పాకీవాడు చీపురు వదిలేశాడు. అందరూ భక్తుడిచుట్టూ చేరి భజన చెయ్యసాగారు.

ఆడదిమాత్రం పురుటి కెదురుచూస్తూ ఉండిపోవలిసివచ్చింది.

పాలం దున్నటంలో ఉన్న ఆనందమూ, రాళ్లు పగలగొట్టటంలో ఉన్న సుఖమూ, రోజుల్లా మగ్గం నెయ్యటంలో ఉన్నతృప్తీ, రోడ్లూడవటంలో ఉన్న పారవశ్యమూ వదులుకుని భక్తులంతా తనచుట్టూ మూగినందుకు భక్తుడు సంతోషించాడు.

"ఇవి మిమ్మల్ని ఉద్ధరించలేవు!" అన్న సత్యాన్ని తమకు తెలియజేసినందుకు రైతూ, రాళ్లుకొట్టేవాడూ, సాలెవాడూ, పాకీవాడూ సంతోషించారు. వారు చదువుకున్నవా రైతే ఆ విషయం వారి కదివరకే తెలిసి ఉండును.

ఇతర భక్తుల్ని తన శిష్యులు చేసుకుని భక్తుడు భక్తాగ్రేసరు డయినాడు.

ఆయనకూ, ఆయన భక్తులకూ ఎక్కడికి వెళ్లినా గొప్ప సత్కారం జరుగుతున్నది.

ఆయనఖ్యాతి నలుదిక్కులా వ్యాపించింది.

కర్మపరిపాకం చాలక ఇంకా తమ వృత్తుల ఉంటున్న రైతు, కంసాలి, సాలె, పాకీ జనం మూలంగా భక్తాగ్రేసరుడి జీవితానికీ, భక్తుల జీవితానికీ ఏ విధమైన కొదువా లేక పోయింది.

తమ వృత్తులను విడిచిపెట్టి హరిపదధ్యానం అవలంబించినవారికి జీవితం ఇప్పుడు సుఖమయంగా ఉంది.

ఈ సంగతి గమనించి ఇతరులుకూడా ఈ భక్తమతంలో చేరటానికి తండోపతండాలుగా వచ్చి భక్తాగ్రేసరుణ్ణి ఆశ్రయించ సాగారు.

భూస్వాముల పొలాలు పాడుపడినై. పెట్టుబడిదార్ల పరిశ్రమలు మూలబడినై.

"ఇది దారుణంగా ఉంది. ఇట్లా అయితే జరగదు!" అన్నారు పెద్దలు.

"ఈ పాములకి మనం చేజేతులా పాలు పోసి పెంచాం!" అన్నారు పెద్దలు.

"వీటిని మారణహోమం చెయ్యకపోతే ప్రపంచం తలక్రిందై పోతుంది!" అన్నారు. పెద్దలు.

"ఈ భక్తాగ్రేసరుడు మారువేషంలో తిరుగుతున్న విప్లవకారుడు, రాజద్రోహి. ఇతను చేస్తున్నది సాంఘిక విప్లవం!" అన్నారు రాజకీయవేత్తలు.

"ఇతను చెబుతున్నదంతా శాస్త్రీయంగా అసత్యం," అన్నారు వైద్యులు. "'హరిజన మిఠాయి తింటే అన్నమెందుకు? హరినామ పానకం తాగితే మంచినీళ్లెందుకు?' అని చెబుతున్నాడు భక్తాగ్రేసరుడు. మిఠాయి తింటే జబ్బుచేస్తుంది, పానకం తాగితే దాహంతీరదు. ఈప్రచారం ఆరోగ్యసూత్రాలకు విరుద్ధంగా ఉంది!" అన్నారు వైద్యులు.

భక్తాగ్రేసరుడు రాజద్రోహిగా, దేశద్రోహిగా నిర్ణయించబడ్డాడు. అతన్నీ అతని అనుచరులనూ కారాగృహంలో ఉంచి, ఒకరాత్రి రహస్యంగా అందర్నీ చిత్రవధ చేశారు.

ప్రభుత్వంచేసిన ఈపనిని జనులంతా గర్హించారు. ఆవిధంగా ఒక ఊరూపేరూ లేని ప్రభుత్వం చరిత్రలో ఒకస్థానం పొందింది.

జనులంతా భక్తాగ్రేసరుడిమీద కథలు అల్లారు. అతనికి ఒక విగ్రహం వేశారు. అతను చచ్చినరోజు పండగచేసుకున్నారు. అతని సంకీర్తనలన్నీ పుస్తకరూపంగా వేసి చౌకగా అమ్మి చాలా లాభాలు సంపాదించి కొందరు మేడలు కట్టుకున్నారు. అతని చరిత్ర చిత్రాలుగా తీసి లక్షలు దోచుకున్నారు.

భక్తాగ్రేసరుణ్ణి ఎట్లా ఉపయోగించుకోవాలో లోకానికి తెలిసి వచ్చింది.

వారి ప్రపంచం

తన దగ్గిర రెండు (హాళీ) రూపాయలు పుచ్చుకుని సరిగా పనిచెయ్యని గడియారం అంటగట్టినందుకు షేకుఫరీదు అనేవాణ్ణి సికింద్రాబాదులో 2 వ తేదీన ఒక అరబ్బీవాడు పొడిచి చంపాడు. అరబ్బీవాడి డబ్బు విలవ దురూహ్యంగా ఉంది.

* * *

ఆంధ్రరాష్ట్ర గ్రామోద్యోగుల సంఘం ది 6-2-41 న 1860 సొసైటీసు ఆక్టుక్రింద రిజస్టరు అయింది.

* * *

గ్రామోద్యోగుల వంశపారం పర్యచట్టం (1894-95) సవరణ చెయ్యటానికి ప్రవేశపెట్టిన బిల్లుకు ఆక్షేపణలు తెలుపుకోవటానికి ప్రభుత్వంవారు ది 28-2-41 వరకూ గడువు పొడిగించారు.

* * *

కొలంబోజిల్లాలో లెగెల్లీ అనే గ్రామంలో ఒకగేదెను గురించి తగాదాపడి ఇద్దరు కోర్టుకెక్కారు. ఇద్దరూ ఆగేడె నాదంటే నాదన్నారు, ప్రమాణం చెయ్యటానికికూడా ఇద్దరును సంసిద్ధులైనారు. ఇద్దరిలోనూ ఒకరు తనని మోసం చేస్తున్నారని గ్రహించి న్యాయాధికారి రెండోవాడికి అన్యాయం చెయ్యా లనుకున్నాడు, ఆగేదెను అమ్మి ఆ డబ్బు దేవాలయానికి ఇచ్చెయ్యమని ఇద్దరికీ సలహా ఇచ్చాడు. దానికి కూడా ఇద్దరూ ఒప్పుకున్నారు!

* * *

మనకు కూడా నాగరికతాభివృద్ధి కావాలన్న మాట నిజమేగాని ఆ అభివృద్ధి మన మతాచారాలకు అడ్డొస్తే మాత్రం సహించం. ఇటీవల కలకత్తాలో ఒక కొత్తట్రాములైను వేశారు. ఆలైను తాలూకు తీగెలు పీర్ల ఊరేగింపుకు అడ్డొచ్చినై. కలకత్తా పీర్లన్నీ కరబలా చెరువు చేరటం రివాజు. ఆచెరువుకు పొయ్యేదారిలో ఈ అంతరాయం కలిగింది. కాస్సేపు ఆతీగెలు తీసివెయ్యవలిసిందని మహమ్మదీయులు ట్రాంకంపెనీని కోరారు. కంపెనీ అంగీకరించలేదు. మహమ్మదీయులు సత్యాగ్రహంచేశారు. దేవుడా అంటూ ట్రాంకంపెనీవారు తీగెలు అడ్డం తియ్యవలిసి వచ్చింది.

* * *

ఆంధ్రా డెమొక్రాటికుపార్టీ ప్రథమ సమావేశం తెనాలిలో జరిగింది. ఫాసిజం నశింపచెయ్యటానికిగాను బ్రిటనుకు యుద్ధంలో మనం సహాయం చెయ్యాలని రాయిగారు ఉపన్యసించారు. ఆకారణంచేతనే రష్యా బ్రిటనుపక్షాన ఎందుకు పోట్లాడటంలేదో, యుద్ధసహాయం చెయ్యరాదనే కాంగ్రెసు తీర్మానం బ్రిటిషు వారి కెంతవరకు ఆటంకంగా ఉందో రాయిగారు చెప్పలేదు. సభ అల్లరితో అంతమయింది. ఆరాత్రి రాయిగారి బసలో విషయనిర్ణయసభ జరిగింది, తీర్మానాలు చేశారు.

* * *

ఆచార్య కృపాలినీగారు ఫిబ్రవరి 9-తేదీన మద్రాసులో పాత కాంగ్రెసుభవన స్థలంలో బహిరంగసభలో కాంగ్రెసు వైఖరినిగురించీ, ప్రభుత్వవైఖరిని గురించీ ఉపన్యసించారు.

గిండీ ఇంజనీరింగుహాస్టలులో పోలీసులు సోదాచేసిఉన్నారు. అందుమీదట విద్యార్థులు ఒకరోజు కాలేజీకి వెళ్లలేదు. వాదందరికీ తలా ఒకరూపాయీ జుల్మానా విధించబడింది. ఆ జుల్మానా తీసివెయ్యమని విద్యార్థులు కోరారు. దాన్ని అధికారులు తీసివెయ్యనందువల్ల 10 ఫిబ్రవరినుండి సమ్మెకట్టారు.

* * *

వినుకొండతాలూకా గ్రామోద్యోగుల మహాసభ గ్రామచట్ట సవరణబిల్లును నిరసించుతూ, గ్రామోద్యోగులు స్థానిక సంస్థలలో ఉండటానికి గల నిరోధాన్ని ఖండించుతూ తీర్మానాలు చేసింది.

* * *

గ్రామోద్యోగుల చట్టసవరణ బిల్లును ఖండించుతూ అమ్మనబ్రోలు ఫిర్కా గ్రామోద్యోగుల సభకూడా ఒక తీర్మానం చేసింది. అనకాపల్ల తాలూకాలో జరిగిన విశాఖపట్టణమండలి గ్రామోద్యోగుల 8 వ మహాసభకూడా పైతీర్మానమే చేసింది.

* * *

చిత్తూరు మునిసిపల్ సంఘంలో సభ్యులుగా ఉన్న 5 గురు కాంగ్రెసుసభ్యుల మింజుమలె ఒక మహమ్మదీయుడు తప్ప మిగతా నలుగురూ రాజీనామా లిచ్చారు.

* * *

గుంటూరు జిల్లాబోర్డు బడ్జెటులో దాదాపు నాలుగులక్షలు తరుగువస్తున్నది. అది సవరించటానికిగాను 21 విధానాలు ఆలోచించారు. అందులో చలివేంద్రాలూ, సత్రాలూ మూసివెయ్యటమూ, పంకాలాగేవాళ్లనీ, ఇతర చిల్లర ఉద్యోగస్తులను తీసివెయ్యటమూ, చిన్న చిన్న జీతాలమీద ఇంక్రిమెంట్లు వగైరాలు కోసివెయ్యటమూ ప్రశంసాపాత్రమయినవి.

* * *

9 ఫిబ్రవరిన బెజవాడలో ఆంధ్రసభస్థాయి సంఘసమావేశం జరిగింది. అనేకతీర్మానాలు జరిగినై. న్యాపతి సుబ్బారావు, వరహగిరి వెంకటజోగయ్య, పుల్లెల శ్యామసుందరరావు ప్రభృతుల మరణాలకు సానుభూతి తీర్మానమూ, జైలులో ఉన్న అనంతశయనం అయ్యంగారి స్థానే శ్రీచల్లపల్లి రాజావారిని తాత్కాలికాధ్యక్షులుగా ఎన్నుకొనే తీర్మానమూ, కోటిరెడ్డిగారిస్థానే వారిసతీమణి రామసుబ్బమ్మగార్నీ, చల్లపల్లి రాజావారిస్థానే తెల్లాకుల జాలయ్యశెట్టిగార్నీ ఉపాధ్యక్షుల పదవులకు ఎన్నుకొనే తీర్మానమున్నూ, వరదాచారిగారి స్థానే గుమ్మిడిదల సుబ్బారావుగార్ని ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకొనే తీర్మానమూ వగైరాలు జరిగినవి. 22 వ ఆంధ్రమహాసభ 15-4-41 లోగా జరుగుతుంది.

* * *

ఈ సభలో జరిగిన ఇతరతీర్మానాలు (1) సరిహద్దులందున్న ఆంధ్రులు తమ జాతీయతనూ మాతృభాషనూ జనాభాలెక్కలలో శ్రద్ధగారికార్డు చేయించాలనీ (2) సర్కారులు నైజాములో కలపరాదనీ, (3) ఆంధ్రసభకార్యస్థానం తాత్కాలికంగా బెజవాడలో ఉంచాలనీ.

* * *

మద్రాసుప్రభుత్వంవారి స్కీముప్రకారం విమానశిక్షణ పొందుతున్న సెల్వరాజు ముత్తయార్ అనే అతడు 13 ఫిబ్రవరినాడు విమానంలో నుంచి పడి చనిపోయినాడు. తరువాత విమానంకూడా ఒక తాటిచెట్టుకు తగిలి పడిపోయింది.

* * *

తూర్పుగోదావరిజిల్లాబోర్డు మీటింగులో యుద్ధనిధికి 10 వే లివ్వాలనే శ్రీ అల్లూరి సూర్యనారాయణరాజుగారు పెట్టిన తీర్మానం వోటింగులో ఓడిపోయింది.

* * *

వేలూరుజైలులో డిటిన్యూలుగా ఉన్న 10,12 మంది విద్యార్థులను విడిచిపెట్టటానికి ప్రభుత్వం నిరాకరించింది.

హిందూమహాసభవారి మరతులకు మార్చినె లాఖరులోగా ప్రభుత్వం అంగీకరించనిపక్షాన హిందూమహాసభవారుకూడా సత్యాగ్రహం చేస్తారని చిటగాంగులో జరిగిన సభలో ప్రకటితమయింది.

* * *

బళ్లారిలో బయలుదేరిన ప్లేగువ్యాధి అధికార్ల చురుకుతనం ధర్మాన చాలావరకు తగ్గిపోయింది.

* * *

కోటప్పకొండప్రాంతంలో కలరా చెలరేగుతున్నది. ఈ నెల 22 లగాయతు 24 వరకూ అక్కడ జరిగే ఉత్సవానికి మామూలుప్రకారం జనంపోవటం క్షేమకరంకాదని గుంటూరుజిల్లా ఆరోగ్యాధికారి ప్రకటన. గుంటూరుజిల్లా కలెక్టరుగారున్నూ ప్రకటచేశారు.

* * *

సత్తెనపల్లిలో హిందూ మహమ్మదీయ కలహాలు జరిగి 8 మందికి బాగాదెబ్బలు తగిలినై. ఏవిధమైన ఎరెస్టులూ జరగలేదు.

* * *

అనకాపల్లి, మచిలీపట్నం, గుడివాడ, గుంటూరు, నరసరావుపేట, నంద్యాల, చిత్తూరు, తిరుపతి, కర్నూలు, కడప, అనంతపురం, హిందూపురం, తాడిపత్రి, ఆదోనీలలోనిస్థానిక సంస్థలలో కాంగ్రెసు మైనారిటీ ఉంది. ఆ కాంగ్రెసు సభ్యులందరూ తమ పదవులకు రాజీనామాలు పారేసి ఉద్యమంలో చేరవలిసిందని ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కార్యదర్శి ప్రకటించారు.

కాంగ్రెసు మెజారిటీ ఉన్నచోట కాంగ్రెసు సభ్యులు ఉద్యమంలోకి రానవసరంలేదు. అవసరమైన కనీసపు మెజారిటీకి పైసంఖ్యవారు వెళ్లవచ్చును.

ఇది పురపాలక సంఘాలకుకూడా వర్తిస్తుంది.

* * *

రేపల్లె తాలూకాలో కలరా చెలరేగింది. ఈ నెల మొదటివారం ఆఖరుకు 60 మంది చనిపోయినారు. ఆరోగ్యశాఖవారు చురుకుగా పని చేసి, 20 వేల ఇంజక్షన్లు ఇచ్చి కలరా ఉధృతం చాలావరకు తగ్గించు కొచ్చారు.

* * *

తాణా మునిసిపాలిటీ మహాత్మా గాంధీమీద ఒక జప్తు వారంటు జారీచేస్తున్నది. తాణాలో ఒక గాంధీ ఆశ్రమం ఉండింది.

* * *

1828 లో ఎవరో ఆ ఆస్తిని గాంధీగారికి దానంచేశారు. 1936 వరకూ అది వారి అధీనంలోనే ఉండింది. 1936 లో వారు ఆ ఆస్తికి ధర్మకర్తలను నియమించి తమ హక్కులన్నీ వదులుకున్నారు. 1928 లగాయతు 36 వరకూ ఆ ఆస్తిమీద రావలిసిన పన్నుకోసం మునిసిపాలిటీ వారు గాంధీగారిమీద వారంటు పెడుతున్నారు.

* * *

జైలులో ప్రకాశం పంతులుగారూ బి. ఎస్. మూర్తిగారూ భాగవతంతో కాలక్షేపం చేస్తున్నారు. రాజగోపాలాచారిగారు షేక్స్పియరుమీద ఉపన్యాసా లిస్తున్నారు. గోపాలరెడ్డిగారు ఉర్దూనేర్చు కుంటున్నారు.

* * *

చిత్తూరులో కృష్ణలీల అనేనాటకం ఏర్పాటు చేసి అందులో గగ్గయ్యా, రామకృష్ణశాస్త్రీ, తదితరులూ నటిస్తారని ప్రకటించారు. గగ్గయ్యగారూ మరికొందరూ రానందున నాటకం ఆగిపోయింది. అల్లరి సాగింది. కుర్చీలూ తలుపులూ తెరలూ తగుమాత్రం ధ్వంసమయినై. మర్నాడు సక్రమంగా నాటకం ఆడారు.